నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# మహబూబాబాద్

గురువారం 30 నవంబర్ 2023
THURSDAY, NOVEMBER 30, 2023 | MAHABUBABAD | 3

## ధరణిని తీసేస్తే భూముల ధరలు తగ్గుతయ్..



బయ్యారం: సీఎం కేసీఆర్ ఎంతో ఆలోచించి తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌ను తీసేస్తే భూముల ధరలు తగ్గుతయ్. గతంలో మాన్యువల్ పద్ధతిలో భూముల వివరాలు కేవలం కాగితాలపైనే ఉండేవి. ఎన్నో అవకతవకలకు ఆస్కారం ఉండేది. ఒకరి భూమిని ఇంకొకరి పేరు మీదికి మార్చి రైతుల మధ్య గొడవలు పెట్టేవారు. నాడు భూములకు సరైన పత్రాలు లేక ధరలు కూడా అంతంత మాత్రంగానే ఉండేవి. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకొచ్చి భూముల వివరాలను ఆన్‌లైన్ చేసి పట్టా పుస్తకాలు అందించింది. దీంతో భూముల రేట్లు రెట్టింపు అయ్యాయి. ఇప్పుడు ఒకరి భూమి ఇంకొకరి పేరు మీదకు మారాలంటే తప్పనిసరిగా యజమాని అనుమతి ఉండాలి. వేలిముద్ర వేయాలి. ఇప్పుడు కాంగ్రెసోళ్లు ధరణి తీసేసి, పటేల్, పట్వారీ వ్యవస్థ తీసుకొస్తే మళ్లీ రైతుల పరిస్థితి దారుణంగా తయారవుతుంది. వ్యవసాయం కూడా మానేస్తరు. ఆలోచన చేసి ఓటు వేస్తే రైతులు, ప్రజల బతుకులు బాగుంటాయి.

– కొండ్రెడ్డి సోమిరెడ్డి, రైతు, బయ్యారం

- మధ్య పేజీలో

# కాపాడినోళ్లనే కాపాడుకుంటం..



### కాంగ్రెస్ అంటే దళారుల రాజ్యం

**మంచిగైన ఎవుసం పాడైతది.. భూముల విలువ పడిపోతది**

**కరెంటు లేకుంటే అరిగోస పడుతం.. మా బతుకులను మళ్లీ ఆగం చేసుకోం**

**కేసీఆరే కంటికి రెప్ప.. కడుపున వెట్టుకొని కాసుకుంటున్న బీఆర్ఎస్ వెంటే ఉంటం**

**స్పష్టం చేస్తున్న రైతులు, ప్రజలు**



'కాంగ్రెసోళ్లుగాని, బీజేపోళ్లుగాని ఏనాడన్న రైతులను పట్టించుకున్నరా? సాగునీళ్లు, పెట్టుబడి సాయం ఇయ్యాలన్న ఆలోచన చేసిన్రా..? ఏండ్లకేండ్లు పాలించిన కాంగ్రెస్, కరెంటన్న ఇచ్చిందా? నీళ్లు లేక భూములన్ని పడావుపడ్డయ్.. రైతులు కూలీలై పనుల్లేక వలసపోయిన్రు.. తెలంగాణ వచ్చినంకనే ఎవుసం బాగుపడ్డది.. భూములన్నీ పచ్చబడ్డయ్.. భూముల విలువ కూడా పెరిగింది. రైతుల మొఖం తెలివైంది. చేతిల నాలుగు పైసలు కనవడుతున్నయ్. ప్రతి ఊల్లె ఏదోఒక పనిదొరుకుతాంది.. ఇంత మంచిగైనంక మళ్ల కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే అంతా ఆగమైతది.. మంచిగ కట్టుకున్న ఇంటిని ఇచ్చగొట్టినట్లయితది. రైతులను.. అన్నివర్గాల ప్రజలను కాపాడుకున్న కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను కాపాడుకుంటం' అంటున్నారు రైతులు.. వ్యవసాయాన్ని పండుగ చేసిన కేసీఆర్‌ను కాదనుకుంటే నోటి కాటి బుక్కను నేలపాలు చేసుకున్నట్లేనని స్పష్టం చేస్తున్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 29

# పోలింగ్ నేడే

- అసెంబ్లీ ఎన్నికలకు జిల్లాలో సర్వం సిద్ధం
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..
- పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది
- విధుల్లో 3,695 మంది అధికారులు, సిబ్బంది 2వేల మంది పోలీసులతో బందోబస్తు
- మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో 539 కేంద్రాలు
- ఓటు వేయనున్న 4,72,606 మంది ఓటర్లు

12



పోలింగ్ సామగ్రితో వెళ్తున్న అధికారి

శాసనసభ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుండగా, జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల పరిధిలో 539 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల కోసం 3,695 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. 2వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో 256 పోలింగ్ కేంద్రాల్లో 2,19,264 మంది, మహబూబాబాద్ నియోజకవర్గంలో 283 పోలింగ్ కేంద్రాల్లో 2,53,342 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రెండు నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రాలను ముస్తాబు చేశారు.

- మహబూబాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ)



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది